కోరిక

హోటల్‌కి చేరుతూనే చుట్టూ చూసి ఎల్లుండి రాత్రి దాకా ఇంటికి చేరుకునే అదృష్టం లేదని తలుచుకుని గిరిధర్ నిట్టూర్చాడు. హోటల్ ఏమీ తక్కువని కాదు. ఢిల్లీలో ఉన్న నాలుగైదు మంచి హోటల్స్‌లో ఇది ఒకటి. అలాటి విషయాలలో డబ్బు మిగుల్చుకునే అలవాటు తన కంపెనీకి లేదు. ఈ రెండు సంవత్సరాల సర్వీసులో తనని ఎంతో అభిమానంగా చూస్తోన్న కంపెనీకి తానూ చాలా చెయ్యగలిగాడు.

గిరిధర్ తన రూములోకి అడుగు పెడుతూనే ఆ చల్లదనానికి వశమైపోయాడు. ఇరవై నిమిషాలు రోడ్డుమీద ప్రయాణం చేసి వొచ్చేసరికి ఆ వేడీ, ధూళీ, పొగా తనని చాలా బాధ పెట్టాయి. ఎడారిలో ప్రయాణం ఇంతకన్న నయం అనిపించింది.

సోఫాలో జారపడి కళ్లు మూసుకున్నాడు గిరిధర్. రాత్రి వాళ్లు ఇచ్చిన డిన్నర్ తన నిద్రని చెడగొట్టింది. తిరిగి వొచ్చేసరికి రెండు అయింది. అయితే, అక్కడ చాలా చర్చలు

జరిగాయి. ప్రశాంతంగా ఉన్న చక్కని గార్డెన్‌లో చాలా విశ్రాంతి దొరికింది. ఆ పరిసరాలలో తన కంపెనీ ఆశపడినదానికన్న మంచి షరతులతో ఒప్పందం అయినంత పనీ అయింది. కాని, పెద్దాయన కపూర్ నవ్వుతూనే తన కొడుకు కరచాలనం చెయ్యకుండా ఆపేశాడు. రక్తంలో ఒక్కబొట్టు ఆల్కహాల్ ఉన్నా వ్యాపారంలో ఏ నిర్ణయమూ తీసుకోకూడదు అని మృదువుగా వారించాడు. "గిరిసాబ్ రేపు నిద్రలేచి ఏమనుకుంటారు? విస్కీ ఇచ్చి అతని చేత మాట అనిపించాం అనుకుంటారు. మన ఆఫీసులో రేపు విషయాలు ముగించుదాం" అన్నాడు. ఒక విధంగా ఆయన చెప్పినది నిజమే. గడియారం చూసుకున్నాడు. ఏడున్నర.

ఈ సరికి తాను ఎక్కాల్సిన విమానం టేకాఫ్‌లో ఉంటుంది! తాను నిద్రించుదామనుకున్న తన బెడ్ ఎడారిలో వెన్నెల లాగ ఏమీ అనుభవం లేకుండా అలాగే ఉండిపోతుంది.

అర్చన వాళ్ల అన్నగారి చిన్న కొడుకుతో ఆడుకుంటూ ఉంటుంది.

అక్కడికి ఫోన్ చేసి అర్చనతో మాటలాడడం గిరిధర్‌కి నచ్చలేదు. అసలే మాటలలో విచ్చులవిడి లేదు ఆమెకి. నలుగురూ ఉంటే మరీ పొడిగా 'అవును....ఊఁ...అలాగా? సరే!' లాటి మాటలకన్న అమెనించి రావు.

సంతోష్ ముఖర్జీ నంబరు డయల్ చేశాడు ఏమీ జరగలేదు. మళ్లీ మళ్లీ డయల్ చేశాడు. రాంగ్ నంబర్లూ లేకపోతే ఎంగేజ్డ్ శబ్దమూ లేకపోతే నిశ్శబ్దం.

కాలేజీలో ముఖర్జీ తనకి సీనియరు. చాలా సరదాగా ఉండేవాడు. కాని, లెక్చరర్లు చెప్పేవి చాలా జాగ్రత్తగా వినేవాడు. ఫస్ట్‌క్లాస్ రావడం ఒక్కటే గొప్ప విషయం అని అతను ప్రతిపాదించి వాదించడమే కాదు - మనసారా నమ్మేవాడు. చిన్న వయసులోనే అతనికి కళ్ళ అద్దాలు వొచ్చేయి. దానితో కొంత ఎక్కువ వయసు ఉన్న వాడిలాగా కనిపించేవాడు. ఆ పరిస్థితిని కూడా అతను బాగా వినియోగించుకున్నాడు. ఉండీ ఉండీ గీతోపదేశంలో కృష్ణుడి పోజు పెట్టి, ఉపదేశాలు ఇచ్చేవాడు. అతనిది మధ్య తరగతి కుటుంబం. ఏమి బాధలు ఉండేవో కాని, అతను మాత్రం ఎప్పుడూ అల్లరి చేసే చిరునవ్వుతోనే కనిపించేవాడు. "నేను గవర్నమెంటు సర్వీసుకి తప్ప పనికిరాను గిరీ!.... మీరందరూ మంచి మంచి మల్టీనేషనల్ ఫరమ్స్‌లో చేరి లక్షల్లో జీతాలు తీసుకుని, పని పురుగులలాగా బతకండి! నేను అలసట లేని ఉద్యోగం చేస్తూ మీ అందరినీ బాధలు పెట్టి సంతృప్తిగా తిని నిద్రపోతాను" అనేవాడు.

గిరిధర్‌కి ఆరోజులూ, ఆ మనిషీ జ్ఞాపకం వొచ్చి, అతన్ని ఎలాగ అయినా కలుసుకోవాలనే కోరిక ద్విగుణీకృతం అయింది. అ నంబరు వెతికి పట్టుకునే పని

ఆపరేటరుకి వొప్పగించాడు. ఢిల్లీలో కూడా టెలిఫోను నంబర్లు తరచుగా మారిపోతున్నాయి. డైరెక్టరీ కేవలం డిపార్టుమెంటు వారు ఆదాయం చేసుకోవడానికి మాత్రమే అని ఒకసారి అనుకుని రెండో నంబరుతీసి డయల్ చేశాడు.

అవతల ఫోనులో రింగు వినిపించడం గిరిధర్‌కి సంతోషం కలిగించింది. కాని, పది పన్నెండు రింగులదాకా టెలిఫోన్ ఎవరూ ఎత్తక పోవడం అతని ఆనందాన్ని పది పన్నెండు మెట్లు కిందికి దింపింది.

ఇంక లాభంలేదు అనుకుంటూంటే ఎవరో ఎత్తేరు. అది ఎవరో కాని, తనకి కావలసిన మనిషి కాదు.

"హల్లో!.....హల్లో!"

నౌకరులాగా ఉన్నాడు. నెంబరు చెప్పి ఆ నెంబరేనా అని అడిగాడు గిరిధర్. అవతలి వాడికి బోధపడినట్లు లేదు. క్యాహై? హల్లో హల్లో అంటున్నాడు బాధగా. ఈసారి నంబరు అంకెలు హిందీలో చెప్పాక ఆ మనిషి మాలుమ్ నహీ అన్నాడు.

అప్పుడు జ్ఞానోదయం అయి చంద్రకుమార్ గుప్తాగారి ఇల్లేనా అని అడిగాక అవును అని సమాధానం ఇచ్చేడు. తన పేరు గోపాల్ కిషన్ తివారీ అనీ తాను అక్కడ నౌకరు అనీ తన జీవిత వివరాలు చెప్పి, గుప్తాసాబ్ కుటుంబంతో కలిసి సిమ్లా వెళ్ళేరని చెప్పేడు. ఎప్పుడొస్తారు? నహీ మాలుమ్. ఎప్పుడు వెళ్లేడు? నహీ మాలుమ్. తివారీకి తన అజ్ఞానం మీద అసహ్యం కలిగిందో ఏమో గిరిధర్ వివరాలు అడిగాడు. ఆ వివరాలు గుప్తాకి చేరుతాయి అనే నమ్మిక లేకుండానే ఇచ్చాడు అతను. పేరూ వూరు ఇక్కడ చిరునామా ఒక్కొక్క అక్షరమే చెప్పి అలిసిపోయి సంభాషణ ముగించాడు గిరిధర్.

కొంత నిరాశతో కిద్వాయ్ నంబరు డయల్ చేసి రింగు రావడంతో ఆశగా ఎదురు చూశాడు గిరిధర్. చిన్న పాప ఎవరో ఎత్తినట్టు ఉంది. ఏమిటో చెప్పింది. చివరికి కిద్వాయ్ భార్య టెలిఫోన్ తీసుకుంది. తనని తాను పరిచయం చేసుకుని కిద్వాయ్‌ని గురించి అడిగేడు. ఆయన పని మీద రాజస్థాన్ వెళ్ళేడట. ఎప్పుడు తిరిగి వొస్తాడో తెలియదు. ఆమెకి తన వివరాలు ఇచ్చి ధన్యవాదాలు చెప్పి ఫోను పెట్టేశాడు గిరిధర్.

కిద్వాయ్ తనకన్న వయసులో పదేళ్లు పెద్ద అయినా చాలా సరదా అయిన మనిషి. ఆరోజుల్లో అతను ఒక కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా ఉండేవాడు. గిరిధర్ ఒకసారి ఒక మిత్రుడితో కలిసి ముషైరాకి వెళ్ళాడు అక్కడ కిద్వాయ్ వినిపించిన షేర్లు అతనికి చాలా నచ్చాయి. వెళ్లి పరిచయం చేసుకున్నాడు. ఆ తరవాత కిద్వాయ్ ఇంటికి చాలాసార్లు వెళ్ళేడు.

ఏడెనిమండుగురిని పిలిచి మర్యాదలు చేసి రెండు మూడు గంటలసేపు కవిత్వం వినిపించడమూ ఘాలిబ్ రాసిన కవితలని ప్రేమగా మరీ మరీ వొప్పజెప్పడమూ జరిగేది. గిరిధర్‌కి ఆ ప్రతీ మెహఫిల్ ఒక అనుభవంగా ఉండేది. ఆ తరవాత కిద్వాయ్ ఒక సంవత్సరం విదేశాలకి వెళ్లడమూ గిరిధర్ ఈ ఉద్యోగంలో చేరి ఢిల్లీ వొదలడమూ జరిగింది. ఇప్పుడు కిద్వాయ్ ప్రొఫెసర్ అయాడు. అతన్ని కలుసుకోలేనందుకు చాలా విచారించాడు గిరిధర్. ఈ రోజు తనదికాదు అనుకున్నాడు. చూద్దామనీ, కలుసుకోవాలనీ ఉన్న ఎవరినీ కలవలేకపోయాడు.

టీ.వీ. పెట్టి చాలాసేపు ప్రోగ్రాంలు మార్చి మార్చి చూస్తూ గడిపేడు. మినీబార్‌లో రకరకాల డ్రింకులు ఉన్నాయి. బ్లాక్‌లేబెల్ తీసి ఒక డ్రింకు చేసుకున్నాడు. కాజూ తింటూ టీ.వీ చూస్తు కొంతసేపు ఆ సాయంత్రపు ఆశాభంగాలనీ అర్చననీ మరిచిపోగలిగాడు.

పది దాటేక ఆపరేటరు ముఖర్జీ నంబరు చెప్పి కాల్ ఇచ్చింది. ముఖర్జీ కలకత్తా వెళ్లేడనీ ఎల్లుండి రావొచ్చుననీ అతని తమ్ముడుట చెప్పేడు. ఫోన్ బుక్‌లో నెంబరు రాసుకుని రెండో డ్రింకు తయారు చేసుకుని వెనక్కి వాలేడు గిరిధర్. అతనికి శ్రీనివాస్ మీద మరొకసారి కోపం వొచ్చింది. అతను ఆపకపోతే ఈపాటికి ఇంటికి చేరి అర్చనతో కబుర్లు చెప్తూ ఉండేవాడు. అది కానిచ్చేడు కాదు ఆ దుర్మార్గుడు!

విసుగ్గా ఛానెల్స్ మార్చి మరో పది నిమిషాలు టీ.వీ చూస్తోన్న గిరిధర్ కరెంటు షాకు కొట్టినవాడిలాగ లేచి కూర్చుని టీ.వీ మీద దృష్టి కేంద్రీకరించాడు. ఆ ఛానెల్లో ఏదో సినిమా వొస్తోంది. ఆ సీనులో స్త్రీ పురుషులిద్దరు ఒక శృంగార దృశ్యంలో ఉన్నారు. నటనలాగ లేదు అది. కాని ఆ యువతి - ఆమె గిరిధర్ మనసులోకి చాలా బలంగా ఇద్దరు స్త్రీలని తెచ్చింది. ఆమెలో ఆ ఇద్దరి పోలికలూ ఉన్నాయి. ఎలాగో ఏమిటో అతనికీ తెలీదు. కాని ఒకేసారి ఆ ఇద్దరూ అతనికి జ్ఞాపకం వొచ్చారు.

అర్చన! ఆమె అంటే తనకి ప్రేమ. అలా చెప్తే చాలదు గాని అంతకన్న మంచి మాటలతో ఆ భావనని గుండెల్లో నించి మాటల్లోకి తేవటం అతనికి చేతకాదు. అవసరమూ లేదు. ఆ భావన మాటల రూపంలోకి రాకుండా అతని గుండెల్లోంచి మనసులోకీ అక్కడినించి గుండెలలోకీ వెడుతుంది. ఆమె తన భార్య. తన ప్రియురాలు. తన అర్చన. తన కళ్ళలో అంతకన్న సుందరి లేదు. అందమైన ముఖమూ వొళ్ళూ మాత్రమే కాదు ఆమె. ఆ కనిపించే అందాలు ఆమెలో ఒక చిన్న భాగం మాత్రమే. ఆమె తనకి దగ్గరగా ఉంటే గంటల కొద్దీ మాటలు లేకుండానే సంభాషణ జరిగే అంత ప్రేమ తనకి. ప్రేమ అంటే

ఇవ్వడం. ఇచ్చి, ఆ ఆనందంలో పాలు పంచుకుని ఆనందించడం - సూర్యరశ్మి చంద్రుడి మీద పడి వొచ్చే వెన్నెల లాగా. ఆ ప్రేమ తనకీ అర్చనకీ మధ్య ఉంది. ఇద్దరిదీ వెన్నెలే. అతనికి ఎప్పుడూ ఒకటే కోరిక .... ఆమెకి బాధ కలిగించే పని ఏదీ ఎప్పుడూ చెయ్యకూడదు అని. ఆమె మీద ఎంత కోరిక అతనికి ఉందో ఆ కోరిక మీద కూడా అంత ఉంది. గిరిధర్‌కి తన దౌర్బల్యమూ దాని బలమూ తెలుసును. అందుకని -

కోరిక బలమూ తెలుసును.

టీ.వీలో సినిమా సాగుతోంది. ఆ వేడి వేడి సీను ముగిసింది. ఆ అమ్మాయి బట్టలు వేసుకుని మరో సీనులో ఉంది. కాని, ఆమె అంద ఏమీ తగ్గలేదు. ఏదో కవ్వింపు ఆమెలోనూ, ఆమె ప్రతికదలికలోనూ ఉన్నాయి. ఆ అంద లోని సారం అర్చనని గుర్తు చేస్తే దానిలోపలి ఆ వేడీ పెంకెతనమూ పూజని జ్ఞాపకం తెచ్చాయి. ఆమెని కిందటిసారి కలుసుకుని రెండు సంవత్సరాలు అయింది. ఆ తరవాత ఆమెని తననించి దూరం చేసుకున్నాడు పూర్తిగా. కాని ఆమె జ్ఞాపకాలు అతన్ని వెంటాడుతూనే ఉన్నాయి. వాటితో, పెనుగులాడి వాటిని తెరల తెరల వెనక్కి నెట్టడం అతను నేర్చుకోగలిగాడు. కాని ఈ వొంటరితనంలో పూజ ఆ తెరలన్నీ తొలగించి తన ఆలోచనల నిండా అలుముకుని నిలబడింది. అదే చిరునవ్వు. అదే ఆప్యాయత. నవ్వుతూ కవ్వించే కళ్ళు. సమ్మోహనంగా ఆమె కదలికలు....అన్నీ అవే. కళ్ళు మూసుకున్నా ఆమె మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

మరొక్క క్షణం ఆ నటిని పరిశీలనగా చూసి గిరిధర్ టీ.వీ కట్టేశాడు. మినిబార్ నుంచి మరొక మినియేచర్ విస్కీతీసి డ్రింక్ తయారుచేసుకున్నాడు. ఐసు ముక్కలు వెయ్యడం మీదా సోడా పొయ్యడం మీదా దృష్టిని కేంద్రీకరించాడు. సోఫా వొదిలి బెడ్‌మీద దిండ్లు పేర్చి జారబడ్డాడు. తాను ఓ.కే. చేసిన కంట్రాక్టు గురించి ఆలోచించాడు. మంచి వ్యాపారం అంటే ఇరుపక్షాలూ తమకే లాభసాటిగా ఉంది అని సంతోషించేదే అన్న సూత్రం జ్ఞాపకానికి తెచ్చుకున్నాడు.

ఆ సూత్రం మొదట చెప్పినది వాసుదేవయ్య. మేనేజిమెంటు ఇన్‌స్టిట్యూట్ బెంగుళూరులో ప్రొఫెసరు.

బెంగుళూరు. తాను పేయింగ్ గెస్టుగా ఉన్న ఇండిపెండెంట్ రూము ఖరీదు ఎక్కువ అయినా చాలా సౌకర్యంగా ఉండేది. బ్రెక్‌ఫాస్టూ డిన్నరూ ఇంటివాళ్ళు ఇచ్చేవారు.

అక్కడ కలిసింది పూజ. ఆమె ఇంటి వారికి ఏదో దూరపుచుట్టం. గ్రాడ్యుయేషన్ అయ్యాక సెక్రటరీకోర్సు చేసి అక్కడ ఉద్యోగం చెయ్యడానికి వొచ్చింది. ఆమె కొద్దిరోజులు

వాళ్ళ అతిథిగా ఉండి పేయింగ్ గెస్టుగా మారింది.

ఆ మొదటి రోజులు అతనికి చూచాయగా మాత్రమే జ్ఞాపకం ఉన్నాయి. పూజని చూడగానే గిరిధర్ ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. ఆమెలో ఉన్న విపరీతమైన ఆకర్షణ అతన్ని ఊపిరి తీసుకోనిచ్చేది కాదు. వాళ్ళ పలకరింపులు హల్లోకీ గుడ్‌మానింగ్‌కీ పరిమితం అయిఉండేవి. గిరిధర్‌కి అంతకన్న ఎక్కువ మాటలాడడానికి మానసికంగా శక్తి ఉండేది కాదు.

ఆమె అతనిని చూడగానే చిరునవ్వుతో పలకరించేది. ఆ చిరునవ్వులో అనిర్వచనీయమైన ఇంద్రజాలం ఉండేది. అతను ఉక్కిరి బిక్కిరి అయిపోయే వాడు. ఆ వయస్సులో ఉన్నవాడికి ఆ రకం ఆకర్షణ సహజం అని గిరిధర్‌కి తెలుసును. కాని దానికన్న ఏదో గొప్ప శక్తి విద్యుత్ ప్రవాహం లాగ తనని ఆక్రమించు కుంటూన్నదని అతనికి అనిపించేది.

అలాగ రెండు మూడు నెలలు గడిచిపోయాక గిరిధర్ ఆమె ఉనికికి కొంత అలవాటు పడ్డాడు. బహుశా అతని ఆరాధన ఇంకా నెలలూ సంవత్సరాలూ అలాగే దూరం నించి గమనించే స్థితిలో ఉండిపోయేదేమో! కాని ఒకనాడు పూజ "నేను నా ఫ్లాట్‌కి మారుతున్నాను" అంది నవ్వుతూ.

"అంటే?"

"నన్ను పెర్మనెంట్ చేశారు... వాళ్లు నాకు ఫ్లాటు ఇచ్చారు. రెండు రోజుల్లో అక్కడికి వెళ్ళిపోతాను" అంది చిరునవ్వు చెరగని ముఖంతో. "మిమ్మల్ని మిస్ అవుతాను...." అన్నాడు గిరిధర్ తనలో పేలిన ఆశాభంగాన్ని దాచుకుంటూ.

"అవును. నాకు తెలుసును....నిజానికి నాఫ్లాట్‌కి నేను వెళ్ళడం సంతోషంగా ఉన్నా ఇక్కడినించి వెళ్ళడం నన్ను బాధపెడుతోంది..." అంది.

రెండు రోజుల్లో ఆమె వెళ్ళిపోయింది. కొత్తఫ్లాటు అడ్రసూ టెలిఫోన్ నంబరూ చిన్న కాగితం మీద టైపుచేసి చిన్న కవర్ లో పెట్టి తలుపుకిందనించి అతని గదిలోకి వొదిలి వెళ్లింది పూజ. కవరుమీద "?" అనే ప్రశ్నార్థకం మాత్రం ఉంది.

ఆ ప్రశ్న ఏమిటో గిరిధర్‌కి బోధపడలేదు. కాని ఆమె అక్కడినించి వెళ్ళిపోవడం అతనికి పెద్దలోటుగా కనిపించింది. రెండు రోజులు అతనికి ఏమీ తోచలేదు. కాని, ఆమెకి ఫోన్ చేసే ధైర్యం అతనికి లేకపోయింది. ఆమె తన మిత్రులందరికీ అలాటి చిన్న కవర్లు ఇచ్చే ఉంటుంది. ఆమె దృష్టిలో తనకి ఏదో ప్రత్యేకత ఉంది అనుకోవడమూ దానిని

ఆధారంగా తీసుకుని ఆమెతో పరిచయం కొనసాగించడమూ అతనికి నచ్చలేదు. తనలో ఆమెకి ప్రత్యేకమైన స్థానం ఉండవచ్చును. తన దృష్టి అనే అద్దంలో ఆమె నీడ. నీడలకి వేరే భావాలు ఏమి ఉంటాయి?

ముఖ్యమైన పరీక్షలు దగ్గరపడడాన్ని గిరిధర్ అదృష్టంగా భావించుకుని చదువుమీద దృష్టి కేంద్రీకరించాడు. పరీక్షలు బాగా రాశాడు. ఇంక ఒక్క సంవత్సరం ఉంది. ఒక వారం సెలవు ఇస్తే సొంతవూరుకి బయలుదేరేడు. అన్ననీ, పిల్లలనీ చూడడం అతనికి సరదా. వాళ్లకి తాను దూరంగా ఉండే ఒక మనిషికన్న ఏమీ కాదు. ఆస్తులు న్యాయంగా పంచి ఇచ్చేశాక అన్నకీ అతనికీ మధ్య నామమాత్రపు సంబంధం మాత్రమే మిగిలింది. కాని, ఎక్కడో స్థిరపడేదాకా ఆవూరు వొచ్చి వారం, పదిరోజులు ఉండి నలుగురినీ పలకరించి వెళ్ళడం గిరిధర్‌కి ఒక వ్యాపకం అయింది. బాగా అజమాయిషీ చేసి ఆర్జన చేస్తూన్న అన్న అతన్ని దగ్గరగా రానివ్వడు. దూరంగా ఉంచే ప్రయత్నమూ చెయ్యడు.

ఈసారి రెండు రోజులు అక్కడ గడపడం కష్టం అయింది గిరిధర్‌కి. కారణం అతనికి తెలుసును. బెంగుళూరు నించి పరీక్షలవగానే వొచ్చెయ్యడం ఈ వూరుమీద ఆకర్షణ కాదు. అది తిరోగమనం. ఆ మాట అతనికి హటాత్తుగా తట్టింది. పూజ అతని ఆలోచనలని పూర్తిగా ఆక్రమించింది. ఆ విషయాన్ని అతను దాచుకునే ప్రయత్నం చేసి చేసి విఫలమయాడు.

వెంటనే తిరుగు ప్రయాణం కట్టేడు. అన్న వారించలేదు. వొదినా పిల్లలు కూడా అడ్డుపడలేదు.

ఆ మరునాడు గది శుభ్రం చేయించుకుని పుస్తకాలు సర్దుకుని చాలాసేపు ఏవోపనులు కల్పించుకుని సాయంత్రం దాకా గడిపేడు. పూజది పెద్ద మల్టీనేషనల్ కంపెనీ. ఆమె ఆరుదాటేదాకా ఇంటికి రాదు.

ఆమె ఆరోజు ఆరుకీ ఏడుకీ కూడా రాలేదు. తొమ్మిదికీ పదికీ కూడా రాలేదు. గిరిధర్‌కి భోజనం సహించలేదు. నిద్రరాలేదు. సౌందర్యం లేని ఆలోచనలతోనూ శాంతి కలిగించని కలలతోనూ అతను నిద్రపోయాడు.

మర్నాడు ఉదయం బ్రెక్‌ఫాస్టు దగ్గర ఇంటివారు చెప్పేరు. పూజ ఆదివారం వొచ్చి వాళ్లని చూసిందట. గిరిధర్‌ని గురించి రెండు మూడు సార్లు అడిగిందట. వాళ్ల బాస్‌తో ఢిల్లీ వెళ్ళిందిట. నేడో రేపో వొస్తుందిట.

అతనికి శాంతి కలగలేదు. అంతసేపు ఎలాగ ఎదురు చూడాలి?

ఆమె ఆ మర్నాడు వొచ్చింది. ఆ సాయంత్రం గిరిధర్ టెలిఫోన్ చెయ్యలేదు.

ఎనిమిది అవుతోంటే తానే వెళ్ళాడు. ఆమె తలుపుతీసి ఏ మాత్రమూ ఆశ్చర్యం వ్యక్తపరచకుండా "రా గిరిధర్! చాలా ఆలస్యం చేశావు!" అంది.

మిగిలిన కథ అంతా చరిత్ర. ఆమె ఏమీ దాచుకోలేదు. గిరిధర్ అంటే ఆమెకి ఎంత ఆకర్షణ అన్నమాట కూడా దాచలేదు. అతనూ అంతే.

ఎంత ఆప్యాయతా అనురాగమూ ఇచ్చింది పూజ తనకి! శారీరకంగా వాళ్ళేదో తప్పు చేస్తున్నారని అతనికి అనిపించలేదు. ఎందుకంటే, ఆమెమీద అతనికి శరీరాన్నీ మాటలనీ సుఖాన్నీ అధిగమించిన మమత ఉంది. దానినే ప్రేమ అంటే అనవొచ్చును. ఆమె తనది. తాను ఆమెవాడు.

ఆ మలయమారుతాలకీ సుడిగాలులకీ మధ్య పూజ తనని చాలా బాధలు పెట్టేది. అతను తన చదువు విషయంలో ఏమీ అశ్రద్ధ చెయ్యకుండా ఎన్నో అంక్షలు పెట్టేది. అతను ఫోనుచేసిగాని ఆమె ఇంటికి రాకూడదు. ఫోన్లో అతని చదువూ టెస్టులూ ప్రాజెక్టులూ అన్నిటి గురించీ తెలుసుకుని అవుననో కాదు అనో అనేది. అవునంటే సమాగమం.

ఆ రోజుల్లో గిరిధర్‌కి చదువూ కాలేజీ మిత్రులూ అన్నీ పూర్తిగా నిరుపయోగంగా కనిపించేవి. అవన్నీ మిథ్య - నిజం ఆమె మాత్రం. జీవితం అంటే ఆమెతో గడిపే ఆ గంటలు - అంతే.

చదువు పూర్తి అవగానే శ్రీనివాస్‌కి ఆఫరు వొచ్చింది. తనకి తెలియకుండానే తనని అంత జాగ్రత్తగా గమనిస్తోన్నవాళ్లు ఉంటారని గిరిధర్ అనుకోలేదు. శ్రీనివాస్ ఒక పెద్ద కంపెనీ తరపున చాలా మంచి ఆఫర్ తెచ్చాడు. నిజానికి అలాటి ఆఫరు తనకీ మరో ఇద్దరికీ మాత్రమే వొచ్చింది. కాని అతను బెంగుళూరు విడిచి వెళ్ళడం అనే మాట ఆలోచనలోకి రానివ్వలేదు. అంతమంచిది కాకపోయినా అక్కడే ఏదో ఒక ఉద్యోగం అతనికి దొరికి తీరుతుంది. ఉద్యోగం చూసుకుని పూజని పెళ్ళి చేసుకుని శాశ్వతంగా ఒక ఆనందమయ ప్రపంచంలో నివసించడానికి అతను నిర్ణయించుకున్నాడు.

కాని పూజ తన అన్ని అంచనాలకి విరుద్ధంగా అతన్ని ఆ ఆఫర్ ఒప్పుకొనేలాగ చేసింది.

"నిన్ను వొదిలి నేను వెళ్ళలేను పూజా!" అన్నాడు గిరిధర్.

"వెళ్ళగలవు గిరీ! వెళ్ళాలి...." అంది పూజ దృఢంగా.

"నిన్ను పెళ్ళి చేసుకుని ఇక్కడే ఉండిపోతాను. ఇంక ఎక్కడా నాకు శాంతి ఉండదు" అన్నాడు గిరిధర్.

"మనకు పెళ్లి అవదు గిరీ! మరచిపో. కారణం అడక్కు" అంది పూజ. గిరిధర్ చాలా ప్రయత్నించాడు. పూజ వీసమెత్తు కూడా స్పందించలేదు. అతనికి అల్టిమేటమ్ ఇచ్చి, మద్రాసు పంపింది.

ఒడ్డున పడిన చేపలాగ అయింది అతని మద్రాసు జీవితం. అతను పూజని మరచిపోలేక పోయాడు. కాని, పూజ అతనికి దూరంగా ఉండడం అలవాటు చేసుకుంది. ఆదివారాలలో బెంగుళూరు వెడితే, ఆమెని కలవడం కష్టం అయిపోయింది. ఆ పరిస్థితికి ఆమె బాధ పడుతూన్నట్టు కనిపించలేదు. రోజులో పది, ఇరవై నిమిషాలకన్న ఆమెతో ఏకాంతం దొరికేదికాదు. ఆమె లాలనగా, ఆప్యాయంగా మాటలాడేది. ఎప్పుడోకాని మాటలకన్నా దగ్గరగా అవడం కుదిరేది కాదు. దానికీ గిరిధర్ అంత బాధ పడలేదు. పూజకీ, తనకీ మధ్య అగాధం ఎందుకు వొచ్చింది? ఎన్నిసార్లు అడిగినా ఆమె పెళ్లి విషయం నిష్కర్షగా ఎందుకు తిరస్కరిస్తుంది? ఆ ప్రశ్నలు చాలాసార్లు అడిగితే ఆమె చిరునవ్వుతో "నువ్వంటే నా కిష్టం గిరీ! అందుకే" అనేది - అంతే.

అలాగ రెండేళ్ళు గడిచాక పూజకి ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. ఆమెకి ప్రమోషన్ వొచ్చింది. అదే సమయంలో గిరిధర్‌కీ, అర్చనకీ పెళ్ళి జరిగింది. పెళ్ళికి నాలుగు రోజుల ముందు బెంగుళూరు వెళ్ళి, పూజని కలిసి అర్చన మాట చెప్పేడు.

"నాకు చాలా ఆనందంగా ఉంది గిరీ! నీకు అన్ని శుభాలూ కలగాలని నా ప్రార్థన!" అంది పూజ. ఆ మాటలు మనసారా ఆడినవని అతనికి తెలుసును.

"నా కొక వాగ్దానం కావాలి!" అంది పూజ.

"ఏమిటి?" అన్నాడు గిరిధర్

"మన మధ్య జరిగిన దాని ఛాయ అర్చనమీద పడనివ్వకు! మళ్లీ ఎప్పుడూ నన్ను కలుసుకోకు .... నీ జీవితం నువ్వు హాయిగా జీవించు. అదే నాకు ఆనందం!" అంది.

ఆమెతో వాదన చేసి లాభంలేదు. గిరిధర్ ఏమీ అనలేదు.

అదే చివరి సమాగమం - న్యూయియర్ కార్డ్స్ తప్పితే.

టేబిల్ మీద గ్లాసులో విస్కీ అలాగే ఉంది. టైము చూసుకున్నాడు. పదిన్నర.

తెగిన ఆనకట్టలోనించి తోసుకుకొచ్చిన నీరు లాగ పూజ జ్ఞాపకాలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. మొన్నటి న్యూఇయర్ కార్డులో ఆమె నంబరు దొరికితే భద్రపరుచుకున్నాడు. ఏ ఆలోచనా తనని ఆపేలోపున ఆమె నంబరు డయల్ చేశాడు.

ఆమే! "నువ్వా గిరీ!" అంది.

"ఎలా ఉన్నావు?"

"చాలా హేపీగా. నువ్వు? పిల్లలా?"

"నేనూ హాయిగా ఉన్నాను పూజా! ఇంకా పిల్లలు లేరు...ఎప్పుడైనా ఆ రోజుల జ్ఞాపకాలు వొస్తూ ఉంటాయి...."

పూజ చిన్న నవ్వు నవ్వి "జీవితంలో చివరికి అన్నీ జ్ఞాపకాలే కదా గిరీ! నిన్న తిన్న డిన్నర్ కూడా.... ఎందుకు ఫోన్ చేశావు?" అంది.

బేక్‌గ్రౌండ్‌లో మాటలు వినిపిస్తున్నాయి అతనికి . ఇంట్లో ఏదో పార్టీ అన్నమాట.

"ఒంటరితనం భరించలేక చేశాను పూజా! ఒక్కసారి నిన్ను చూడాలని ఉంది..."

రెండు నిమిషాలు పూజ మాట్లాడలేదు. ఉత్కంఠతో అతను రిసీవర్‌ని చెవికి నొక్కి పెట్టుకున్నాడు.

"గిరీ! మన స్నేహం జ్ఞాపకాలలో కలిసిపోయిందనుకున్నా. కానీ, నీలాగే నేనూ పూర్తిగా మరిచిపోలేకుండా ఉన్నాను. రేపు ఉదయం మా సిస్టర్ ఎవరెవరినో బ్రేక్ ఫాస్టుకి పిలిచింది....రెండు గంటలకి వొస్తాను సరేనా!" అంది.

"ఎక్సలెంట్" అన్నాడు గిరిధర్. "గుడ్‌నైట్"!

అతను గ్లాసులో మిగిలిన విస్కీ త్వరగా తాగి రెస్టారెంట్‌కి వెళ్లి డిన్నర్ తినివొచ్చి నిద్రపోయాడు.

ఉదయం టెలిఫోన్ రింగు విని గిరిధర్ నిద్రలేచాడు. టైము చూసుకున్నాడు. పది దాటింది.

ఫోనులో పూజ! అతనికి ఒక్కసారి వొళ్లుపులకరిచింది.

ఎప్పటిలాగే అనవసర ప్రసంగం లేకుండా ఆమె విషయానికి వొచ్చింది. ఆమె తన బాస్‌ని కలుసుకోవాలిట. అది ముగించి రెండున్నరకి వొస్తాను అన్నది. కాని, గిరిధర్ హోటల్ లాబీలో ఉండాలి.

"తప్పకుండాను .... ఎదురు చూస్తాను. బాస్‌ని త్వరగా పంపెయ్యి" అన్నాడు గిరిధర్.

"బాస్‌లని పంపడం జరగదు, వాళ్ళు వెడతారు" అంది పూజ నవ్వుతూ.

"నీ కోసం అప్పటిలాగే ఎదురు చూస్తాను..." అన్నాడు గిరిధర్.

"ఒంటరిగా... అప్పటిలాగే.....ఏం?" అంది పూజ ఫోన్ పెట్టేస్తూ.

గిరిధర్ జిమ్‌కి వెళ్ళి గంటసేపు గడిపాడు. ఆ తరవాత స్విమింగ్ పూల్‌లో

ఒంటిగంటన్నర దాకా ఉండి, షవర్‌చేసి రూముకి వొచ్చి బట్టలు వేసుకున్నాడు. అప్పటికి టైము రెండు అయింది.

డోర్ బెల్లు విని తలుపు తీశాడు.

సంతోష్ ముఖర్జీ గిరిధర్‌ని చూస్తూనే ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. గిరిధర్ చాలా సంతోషంగా అతన్ని ఆహ్వానించాడు. అతను నిన్నరాత్రి వొచ్చాడుట. మళ్లీ ఫోన్ ఎందుకు అని తిన్నగా గిరిధర్‌ని చూడడానికి వొచ్చేశాడు.

చాలా సంతోషం ప్రకటించి గిరిధర్ అతని వివరాలు అడిగేడు. అతను ఇండస్ట్రీస్ మినిస్ట్రీలో డైరక్టరుగా ఉన్నాడట. తన వివరాలన్నీ చెప్పి గిరిధర్ వివరాలన్నీ అడిగి ఎంతో ఆనందంగా "నేను చెప్పినట్టే గవర్నమెంటు సర్వీసులో చేరేను. నేను అనుకున్నట్టే నువ్వు మేనేజిమెంటులో చేరేవు. ఎప్పుడు నీకు పనివున్నా నా దగ్గరికిరా. పాతమిత్రుడిని కలుసుకోవడం నాకు సంతోషం ...అందులోనూ నువ్వు!" అంటూ సంభాషణ సాగించాడు.

"టీ తెప్పించేదా?" అన్నాడు గిరిధర్.

"గవర్నమెంటు ఆఫీసరులాగ మాట్లాడకు. నేను నీతో లంచ్ చేస్తానని శ్రీమతికి చెప్పి వొచ్చాను" అన్నాడు ముఖర్జీ.

రెస్టారెంటుకి వెళ్ళడం వేరు వేరు కారణాలవలన ఇద్దరికీ ఇష్టం లేదు. గిరిధర్ అటు తిరిగి వాచీ చూసుకున్నాడు. రెండున్నర దాటింది.

ముఖర్జీ సలహా ప్రకారం లంచ్ ఆర్డర్ చేస్తోంటే కాల్‌బెల్ మళ్ళీ మోగింది. చంద్రకుమార్ గుప్తా. అతను గూడా చాలా సంతోషంగా పలకరించాడు. అతనికీ స్వాగతం చెప్పి క్షేమ సమాచారాలు అడిగీ చెప్పీ ముఖర్జీని పరిచయం చేసే గిరిధర్ కిందామీదా అయిపోయాడు. ఈసరికి పూజ లాబీలో కూర్చుని ఉంటుంది.... తనకోసం ఆత్రంగా ఎదురుచూస్తూ. కోపం వచ్చిందేమో!

గుప్తా, ముఖర్జీ కలిసి "తినేది తరవాత - తాగేది ముందు" అని బీరు తెప్పించమన్నారు.

గిరిధర్ ఆర్డరు చేసి దానితో అనుపానాలు కూడా చెప్పేడు. గుప్తా అతన్ని పరిశీలనగా చూసి "ఏమిటి నీ టెన్షను? ఫ్లయిట్ ఎన్నింటికి?" అన్నాడు.

"ఏడున్నరకి ....రేపు....."

"ఇంకా చాలా టైము ఉందిలే - నేను నిన్ను డ్రాప్ చేస్తాను" అని భరోసా ఇచ్చాడు గుప్తా.

"థేంక్స్....కాని...మీకు శ్రమ...." అన్నాడు గిరిధర్.

"దోస్తీలో శ్రమలూ క్షమలూ ఉండవు" అన్నాడు గుప్తా బీరు తాగుతూ. అదే సమయంలో మళ్ళీ ఎవరో వొచ్చారు. రూమ్ సర్వీస్‌వాడూ కిద్వాయీ కలిసి వొచ్చారు.

మళ్లీ మనసారా కిద్వాయికి స్వాగతం చెప్పి అందరికీ పరిచయాలు చేయగానే కిద్వాయి అనుకోకుండా కలిసిన ఆ సఖులని నక్షత్రాలతోనూ గిరిధర్‌ని చందమామతోనూ పోలుస్తూ ఒక కవిత చెప్పాడు. వహ్వా! వహ్వా అంటూ అందరు మెచ్చుకున్నారు. మరికొంత బీరు, తినడానికి అల్పాహారాలూ ఆర్డర్ చేసి గిరిధర్ ఒక్కసారి బయటికి వెళ్ళాలని ప్రయత్నించాడు.

కిద్వాయ్ అదే సమయంలో మరో షేర్ సెలవిచ్చాడు.

చివరికి టాయిలెట్‌కి వెళ్లి అక్కడినించి ఎవరూ చూడకుండా బయట పడ్డాడు గిరిధర్. టైము ఆరు దగ్గర. అతనికి చాలా నీరసంగానూ భయంగానూ నిరాశగానూ ఉంది.

లాబీలో ఒకసారి రెండుసార్లు చుట్టూ చూశాడు. పూజ జాడ లేదు. ఆమె రెండున్నరకి వొచ్చి చూసి చూసి వెళ్లిపోయిందన్నమాట - చేతికి చిక్కిన స్వర్గం వేళ్ళమధ్యనించి జారిపోయింది!

ఆమెకి ఫోన్ చేద్దామని వెళ్ళేడు. కాని ఆమె నంబరు గుర్తుకి రాలేదు. అది తన రూములో నోట్‌బుక్‌లో ఉంది.

మళ్ళీ రూముకి వొచ్చేడు. కవిత్వమూ కథలూ సంగీతమూ కలిసి సాగుతూనే ఉన్నాయి. వాళ్ళు తన నిష్క్రమణాన్ని గమనించినట్టే లేదు.

ఆ రాత్రి పదకొండున్నరకి వాళ్ళు వెళ్ళేరు ఆనందంగా.

ఆ సమయంలో పూజకి ఫోన్ చెయ్యడం మంచి పనిగా తోచలేదు. చాలా సేపు టి.వి. చూస్తూ గడిపి మగత నిద్రలోకి దిగజారాడు అతను. ఉదయం ఫోను చెయ్యవచ్చులే అనుకున్నాడు.

ఉదయం అతను ఆలస్యంగానే లేచాడు. త్వరగా తయారు అయి బయలు దేరాడు. ప్రతి నిమిషమూ పూజ అతనికి జ్ఞాపకం వొస్తోంది. కాని....ఆమెతో మాటలాడే అవకాశం ఇంక రాదేమో!

కారులో కూర్చోగానే అతని ఆలోచనలు తాను చెయ్యాల్సిన పనుల మీదకి పోయాయి. ఆఫీసులో కాలు పెట్టగానే కపూర్లు ఇద్దరూ స్వాగతం చెప్పేరు. టీతాగడం అయాక కంట్రాక్టు ముసాయిదా తయారు అవడానికి రెండు గంటలు పట్టింది. లంచికి బయలుదేరి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం మూడు అవబోయింది. వాళ్ళు రాహుకాలమో మరేదో అని ఐదుగంటలకి సంతకాలు చేశారు.

హోటల్‌కి చేరేసరికి ఆరు అవుతోంది. చెకౌట్ చేసి వెళ్ళాలి. తాళం తీసుకుంటూ ఆ మాట చెప్పేడు. తాళంతోపాటు చిన్న కవరు కూడా ఇచ్చింది రిసెప్షనిస్టు. రూముకి చేరి సూట్‌కేస్ పేక్ చేసుకుని ఎయిర్‌పోర్టుకి చేరేసరికి చాలా ఆలస్యం అయింది. బోర్డింగు అవుతోంది.

గిరిధర్ తన సీటులో కూర్చుని రెండు మూడు నిమిషాలు కళ్ళుమూసుకున్నాడు. అతను చాలా అలిసిపోయాడు. ఆ అలసట శరీరానికే కాదు - మనసుకి కూడా.

టేకాఫ్ అయి విమానం క్రమంగామీదకి ఎక్కుతోంది. అప్పుడు గిరిధర్‌కి రెసెప్షన్‌లో ఇచ్చిన ఆ చిన్న కవరు జ్ఞాపకం వొచ్చింది. జాగ్రత్తగా విప్పి లోపలి చిన్న కాగితం చదివేడు.

'గిరీ!'

ఏ సినిమా ముగిసినా తెల్లటితెర మాత్రమే మిగులుతుంది.

అన్ని అనుభవాలూ జ్ఞాపకాలు అయిపోతాయి. అవి సజీవంగా ఉండాలంటే వాటిని అలాగే ఉండనివ్వాలి.

ఉండనీ.

'P'

ఉత్తరం మళ్లీ జాగ్రత్తగా మడిచి కవరులో పెట్టి జేబులో భద్రపరిచాడు గిరిధర్. విమానం దిగాక దానిని గౌరవంగా నాశనం చెయ్యాలి.

పదివేల మీటర్ల ఎత్తున విమానం ఎగురుతోంది.

డిన్నర్ సర్వీస్ ప్రారంభం అవుతుందని అనౌన్స్ చేశారు.

గిరిధర్ తన ప్రయాణం గురించి ఆలోచించాడు. ఈ రోజు తాను అక్కడ ఉండకపోతే కంట్రాక్టు ఇంత త్వరగానూ సంతృప్తిగానూ వొచ్చేది కాదు.

కాని వ్యక్తిగతంగా తన కోరిక తీరలేదు. ఒక్కసారి పూజని కలిసి ఉంటే మరో జ్ఞాపకం ఉండేది. కాని ఆ కోరిక తీరలేదు.

అతనికి అర్చన జ్ఞాపకం వొచ్చింది. నిన్నంతా ఆమె గుర్తుకి రాలేదు. కాని ఆరాత్రి ఆమెతో ఉండబోవడం అతనికి ఎంతో ఉత్సాహం కలిగిస్తోంది. అతని మనసు రెండు మూడు గంటల ముందుకి వెళ్ళిపోయింది.

ఆ ఆలోచనల మధ్య అతను మళ్ళీ ప్రస్తుతానికి వొచ్చాడు.

అర్చనకి బాధ కలిగించే ఏ పనీ చెయ్యకూడదు అనే తన కోరిక అతనికి జ్ఞాపకం వొచ్చింది. ఆ కోరిక నిజంగానూ సంతృప్తికరంగానూ తీరింది. దానికి ముఖర్జీ గుప్తా కిద్వాయీ సహాయపడ్డారు. గిరిధర్ వాళ్ళకి మనసులోనే ధన్యవాదాలు చెప్పుకుని సీటులో వెనక్కి జారబడి కళ్లు మూసుకుని అర్చనని మనసులోకి తెచ్చుకున్నాడు. ❖